# సమస్యల 'సిలబస్'తో చదువు సతమతం

జయప్రకాష్ నారాయణ్

Bhavishyat Bharatam, 09-Jan- 2006

...గడచిన ఆరు దశాబ్దాలుగా విద్యారంగాన్ని భారత్ నిర్లక్ష్యం చేస్తూనే వచ్చింది. ప్రస్తుతం ప్రాథమిక హక్కుగా గుర్తించిన ప్రాథమిక విద్యలో సైతం మనం- ఇప్పటికీ పిల్లలను పాఠశాలల్లో చేర్చడం, వారు మధ్యలో బడి మానేయకుండా చూడటం వంటి విషయాలకే ప్రాధాన్యం ఇస్తున్నాం. అంతేతప్ప వారికి నాణ్యత, ప్రమాణాలతో కూడిన విద్యను గరపడానికి మనం ఎటువంటి కృషీ చేయడం లేదు. ప్రాథమిక దశలోనే విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించడం ముఖ్యం...

"దేశాల కలిమిలేములు ఉన్నత విద్యలో అవి పాటించే నాణ్యతా ప్రమాణాలపైనే ఆధారపడి ఉంటాయి. వృత్తిగతంగా చక్కని నైపుణ్యాలు, విద్యపరంగా విశేష ప్రతిభా పాటవాలు కనబరచే దేశాలు ఆర్థికంగా ప్రగతి పథంలో ముందుకు దూసుకుపోతాయి. రానున్న కాలంలో-చదువులో వెనకబడే దేశాలది అధోగతే"- రైస్ విశ్వవిద్యాలయం అధ్యక్షుడు మాల్కోం గిల్ 1999లో ఎంతో ముందుచూపుతో చెప్పిన ఈ మాటలకు ఇప్పటికీ ప్రాధాన్యముంది. అవి ప్రపంచంలోని అన్ని దేశాలకూ వర్తిస్తాయి. భారతదేశం విషయంలో మరింత ఎక్కువగా వర్తిస్తాయి.

ఉపాధి హామీపై ఇటీవల కాలంలో విస్తృతస్థాయిలో చర్చ జరుగుతోంది. అయితే- నైపుణ్యాలను పెంపొందించడం, సాధికారత, విద్య వంటి అసలు సమస్యలను ఈ చర్చ సందర్భంగా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఉపాధి హామీ పథకంలోని సదుద్దేశం కాదనలేనిదే. కానీ- అది పేదప్రజల ఆకలి దప్పులను తీర్చడానికి తాత్కాలికంగా ఉపకరించే ఉపశమన చర్య మాత్రమే. కొన్ని చేదు నిజాలను కప్పిపుచ్చడానికి ఇటువంటి ఉపశమన చర్యలు పనికివస్తాయి. తమ సత్తాలో కనీసం కొంతైనా చాటుకోవడానికి దోహదం చేసేలా ప్రజల నైపుణ్యాలను పెంపొందించడంలో ప్రభుత్వాలు దారుణంగా విఫలమయ్యాయి. మనది అధునాతన ఆర్థిక వ్యవస్థ. దాని ఉత్పాదకతలో భాగస్వాములయ్యే అవకాశం భారతీయుల్లోని అత్యధికులకు లభించనే లేదు. ఇండియాలో బహుకొద్ది ప్రాంతాలు మాత్రమే అభివృద్ధి పథంలో ముందుకు దూసుకుపోతుండగా, మిగిలిన ప్రాంతాలు దుర్భర దారిద్ర్యంతో సతమతమవుతున్నాయి.

### *నాణ్యత, ప్రమాణాలు కరవు*

గడచిన ఆరు దశాబ్దాలుగా విద్యారంగాన్ని భారత్ నిర్లక్ష్యం చేస్తూనే వచ్చింది. ప్రస్తుతం ప్రాథమిక హక్కుగా గుర్తించిన ప్రాథమిక విద్యలో సైతం మనం- ఇప్పటికీ పిల్లలను పాఠశాలల్లో చేర్చడం, వారు మధ్యలో బడి మానేయకుండా చూడటం వంటి విషయాలకే ప్రాధాన్యం ఇస్తున్నాం. అంతేతప్ప వారికి నాణ్యత, ప్రమాణాలతో కూడిన విద్యను గరపడానికి మనం ఎటువంటి కృషీ చేయడం లేదు. ప్రాథమిక దశలోనే విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించడం ముఖ్యం. పాఠశాల విద్యాభ్యాసం తరవాత- వారు కనీస స్థాయి పరిజ్ఞానం క

లిగి ఉండటానికి అది దోహదం చేస్తుంది. సులభ గణితం, ధారాళంగా మాట్లాడటం, చక్కగా రాయగలగడం- అక్షరాస్యతకు మౌలికంగా అత్యవసరమైనవి ఇవే. అయితే మనదేశంలో ప్రాథమిక విద్యను అభ్యసించే వారిలో అత్యధికులకు అవి దుర్లభంగానే ఉన్నాయి. ప్రాథమిక విద్యను దారుణంగా నిర్లక్ష్యం చేయడంతో పాటు, పిల్లలను పాఠశాలల్లో చేర్చడం, వారు బడి మానకుండా చూడటమే ప్రభుత్వాల లక్ష్యంగా ఉన్నప్పుడు- మాధ్యమిక విద్యను అవి పట్టించుకోకపోవడంలో ఆశ్చర్యమేముంది? 'ప్రాథమిక పాఠశాల పట్టభద్రుల' సాయంతో ఈ పోటీ ప్రపంచాన్ని తట్టుకోవడం అసాధ్యమని ఇప్పుడిప్పుడే గ్రహిస్తున్న పాలకులు- మాధ్యమిక విద్య ప్రాధాన్యాన్ని ఆలస్యంగానైనా గుర్తించినట్లున్నారు! మాధ్యమిక విద్యారంగం కోసం 'సర్వశిక్షా అభియాన్' తరహాలో ఓ పథకాన్ని అమలుచేయాలని యోచిస్తున్నారు. అయితే-దాంట్లోను పాఠశాలలకు అవసరమైన మౌలిక వసతుల కల్పన (తరగతి గదుల నిర్మాణం), ఉపాధ్యాయుల నియామకం వంటి విషయాలకే పెద్ద పీట వేస్తున్నారు. అంతేతప్ప- మాధ్యమికస్థాయిలో విద్యార్థులకు నాణ్యత, ప్రమాణాలతో కూడిన విద్యను బోధించడంపైకానీ, మన ఆర్థిక వ్యవస్థలో ఉత్పాదకతకు వారు దోహదపడే విధంగాకానీ లేదా విశ్వవిద్యాలయ స్థాయిలో విద్యనభ్యసించడానికి కానీ తగిన రీతిలో ఆ విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించడానికి ప్రాధాన్యమివ్వడం లేదు.

ఒకప్పుడు- సంఖ్యాపరంగా తక్కువగా ఉన్నా, మన ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థుల్లోని అంతర్గత ప్రతిభాపాటవాలను వెలికి తీయడంలో ఎంతగానో దోహదపడ్డాయి. అందువల్లనే- స్వాతంత్ర్యానంతరం పాతికేళ్లపాటు ఓ తరానికి ప్రయోజనం కలిగింది. అనంతర కాలంలో ప్రభుత్వాలు తాత్కాలిక లబ్ధి కోసం ప్రజాకర్షక విధానాలను అనుసరించడం- జాతి నిర్మాణానికి అవరోధంగా పరిణమించింది. మౌలిక సేవలకు విఘాతంగా తయారైంది. ఆ క్రమంలో- శాంతి భద్రతల రంగం, న్యాయం, మౌలిక వసతుల కల్పన, సహజ వనరుల అభివృద్ధి వంటి వాటితోపాటు విద్య, ఆరోగ్య పరిరక్షణ రంగాలు దెబ్బతిన్నాయి. విద్యారంగంలో ప్రభుత్వ వైఫల్యానికి తోడు, బోధన మాధ్యమంగా ఆంగ్లం పట్ల ప్రజల్లో మోజు పెరిగింది. దీంతో- మధ్య తరగతి ప్రజలు ప్రైవేట్ విద్యారంగాన్ని ఆశ్రయించారు. ఈ ప్రైవేట్ పాఠశాలల్లో విద్యలో నాణ్యతా ప్రమాణాలు పాటించేవాటి సంఖ్య చాలా తక్కువ. ఇక ఈ స్కూళ్లలో పనిచేసే ఉపాధ్యాయుల్లో ప్రతిభా పాటవాలు లేనివారే ఎక్కువగా ఉంటారు. అభం శుభం తెలియని పిల్లలకు వారికి అర్థంకాని భాషలో ఈ టీచర్లు పాఠాలు చెబుతుంటారు. మధ్యతరగతికి చెందిన ప్రజలు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడం మానేస్తున్నా- ప్రభుత్వ స్కూళ్లలో విద్యా ప్రమాణాలను పెంపొందించాలన్న ధ్యాసే పూర్తిగా కొరవడింది. ఆఖరికి- ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయుల్లో సైతం చాలామంది తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చడంలేదంటే- అవి ఎంత అధ్వానంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

ఉన్నత విద్యారంగంలో వైఫల్యాల వల్ల పరిస్థితి మరింత దిగజారింది. మన విశ్వవిద్యాలయాల వైఫల్యాలను ఐ.ఐ.టి.లు, ఐ.ఐ.ఎం.ఎస్.లు కొంతవరకు కప్పిపుచ్చుతున్నాయి. సంఖ్యాపరంగా చూస్తే ఉన్నత విద్యారంగం పరిస్థితి బాగానే ఉన్నట్లు కనబడుతుంది. విశ్వవిద్యాలయ స్థాయి గల సంస్థలు 330, కళాశాలలు 16 వేలు ఉన్నాయి. కోటిమంది విద్యార్థులు, మూడులక్షల యాభైవేలమంది టీచర్లు, రెండు కోట్ల యాభైలక్షలమంది గ్రాడ్యుయేట్లు, పోస్టు గ్రాడ్యుయేట్లు ఉన్నారు. అరవైలక్షలమంది శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, వైద్యులు, సాంకేతిక నిపుణులు ఉన్నారు. అయితే- గ్రాడ్యుయేట్లలో అనేకమందికి ప్రాథమిక పరిజ్ఞానం, నైపుణ్యం లేకపోవడం

విచారకరం. ప్రభుత్వం ప్రాథమిక విద్యపై తన దృష్టిని కేంద్రీకరించాలని, ఉన్నత విద్యకు అంతగా ప్రాధాన్యం లేదని మన దేశంలోని మేధావులు ఒకప్పుడు వాదించేవారు. అయితే- పాఠశాల విద్యకు, యూనివర్సిటీ స్థాయి విద్యకు పరస్పర సంబంధం ఉందన్న అభిప్రాయం క్రమేణా బలపడుతోంది. పాఠశాలల్లో పాఠాలు బోధించడానికి తగిన ఉపాధ్యాయులను తయారు చేయగలిగిన నైపుణ్యం కానీ, ప్రతిభా పాటవాలు కానీ ఇప్పటి యూనివర్సిటీ గ్రాడ్యుయేట్లలో లేవు. ఉన్నత విద్య ద్వారా ప్రయోజకులు కావడానికి అవసరమైన పరిజ్ఞానం, నైపుణ్యం నేటి యూనివర్సిటీ విద్యార్థుల్లో చాలామందికి లేవు. పాఠశాల స్థాయిలో వారికి మంచి నాణ్యత, చక్కటి ప్రమాణాలతో కూడిన విద్యను బోధించకపోవడమే అందుకు కారణం. ఇది ఓ విష వలయంలా తయారైంది.

*సృజనాత్మకంగా దిద్దుబాటు చర్యలు*

మొత్తంమీద మన విద్యారంగం పరిస్థితి ఎంతమాత్రం బాగోలేదన్నది నిర్వివాదం. అయితే- ఈ 'కారుచీకటిలోను ఓ కాంతిరేఖ' ద్యోతకమవుతోంది. అదేమిటంటే- ఇక్కడి పిల్లలకు విద్యార్జన పట్ల గాఢానురక్తి ఉంది. చదువు కోసం ఎంతైనా కష్టించే తత్వం వారిది. తమ పిల్లల చదువు కోసం ఎన్ని త్యాగాలైనా చేయడానికి తల్లిదండ్రులూ సిద్ధంగా ఉన్నారు. చదువుకు మన సమాజం ఎంతో విలువనిస్తోంది. విద్యకు అవసరమైన మౌలిక వసతులూ ఉన్నాయి. సులభంగా ఆచరించదగిన కొన్ని విధానాలను సృజనాత్మక దృక్పథంతో రూపొందించి, అమలుచేయడం ద్వారా- విద్యారంగంలో నెలకొన్న అవ్యవస్థను చక్కదిద్దవచ్చు. తద్వారా- దానికి సరికొత్త రూపురేఖలు సంతరింపజేయవచ్చు. ఆ లక్ష్యం సాధించాలంటే మనం పఠించాల్సిన తారకమంత్రం ఒక్కటే. అది- విద్యే... కేవలం విద్యే... విద్య మాత్రమే.

(రచయిత లోక్‌సత్తా, 'ఓట్ ఇండియా'ల సమన్వయకర్త)